ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
ఆదివారం 25 ఆగస్టు 2024





జగదేవ్‌పూర్ మాస్టర్‌మైండ్ స్కూల్‌లో కన్నయ్య చుట్టూ తిరుగుతూ ఆడుతున్న గోపికలు



గోకులకృష్ణ.. గోపాలకృష్ణ

నెమలి పింఛం, పిల్లనగోవి చేతపట్టి మురిపాల చిన్నకృష్ణయ్యలు సందడి చేశారు. ఉట్టిని కొట్టేందుకు ఉత్సాహం చూపారు. ముద్దులొలికే చిన్నిగోపికలు ఉట్టిని లాగుతూ.. కృష్ణయ్య చుట్టూ ఆడుతూ పాడారు. శనివారం జిల్లాలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన వేడుకలతో కృష్ణాష్టమి రెండు రోజుల ముందే వచ్చిందా అనిపించింది.



సిద్దిపేట గౌతమ్ మోడల్ స్కూల్లో ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణుడు

రాష్ట్రంలో సిద్దిపేట ఆర్టీసీ డిపోకు మూడో స్థానం



నగదు బహుమతి అందుకుంటున్న డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 24 : సిద్దిపేట ఆర్టీసీ డిపో 203-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉత్తమ డిపోగా మూడో స్థానంలో నిలిచింది. ఇందుకు గాను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.2 లక్షల నగదు బహుమతి, మెమెంటో అందజేయగా కార్మికుల పక్షాన డిపో మేనేజర్ వై.సుఖేందర్‌రెడ్డి శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ అవార్డు రావడానికి కారణమైన కండక్టర్లు, డ్రైవర్లు, పీహెచ్‌బీ డ్రైవర్లు, అద్దె బస్సు యజమానులు, సూపర్‌వైజర్లు, మెకానిక్, ట్రాఫిక్ జనరేటింగ్ పాయింట్లలో కష్టపడి పనిచేసి సహకరించిన వారందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పని చేసి సంస్థను తద్వారా డిపోను లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అక్కెనపల్లి మోడల్ స్కూల్‌కు పురస్కారం



రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకుంటున్న ప్రిన్సిపల్ రవీందర్‌గౌడ్

నంగునూరు, ఆగస్టు 24 : ఇంటర్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 100 శాతం, సెకండియర్‌లో 99 శాతం ఉత్తీర్ణత సాధించి తెలంగాణ మోడల్ స్కూళ్లల్లో రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచిన నంగునూరు మండలం అక్కెనపల్లి ఆదర్శ పాఠశాలకు పురస్కారం లభించినట్లు ప్రిన్సిపల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, అడిషనల్ డైరెక్టర్లు లింగయ్య, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్, మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ నుంచి శనివారం ప్రిన్సిపల్ రవీందర్‌గౌడ్ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని తెలిపారు. నైపుణ్యం గల అధ్యాపకులతో మంచి విద్యాబోధన అందిస్తుండడంతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయన్నారు. అందులో భాగంగానే రాష్ట్రస్థాయి అవార్డును అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇందుకు సహకరించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హైడ్రా.. ఇటు చూడు



సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు శిఖంలో అక్రమంగా ఏర్పాటైన వెంచర్‌కు సంబంధించిన హద్దురాళ్లు

కొండాపూర్ మండలం మన్‌సాన్‌పల్లిలో ఓ వెంచర్ కోసం వాగుపై నిబంధనలకు విరుద్ధంగా వంతెన

చెరువులు, కుంటలు, వాగులను ఆక్రమిస్తూ నిర్మించిన కట్టడాలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) ఉక్కుపాదం మోపుతున్నది. అయితే, హైదరాబాద్ చుట్టూ విస్తరించిన ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోనే ఇది కొనసాగుతోంది. చెరువులు, కుంటలను పరిరక్షించడం.. అక్రమ నిర్మాణాలను తొలగించే చర్యలు హైడ్రా చేపట్టింది. ఇవి హైదరాబాద్‌కే పరిమితం కాకుండా పక్కనే ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాకూ విస్తరించాలనే విన్నపాలు ప్రభుత్వానికి అందుతున్నాయి.



పటాన్‌చెరు మండలం రుద్రారంలోని కోమటికుంటను పూడ్చడానికి వేసిన మట్టి

ఉమ్మడి జిల్లాలో అడ్డగోలు కబ్జాలు | చెరువులు, కుంటలను వదలని అక్రమార్కులు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- ఓఆర్ఆర్ పరిధి దాటాలంటూ విన్నపాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఆగస్టు 24 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలోనే ఉమ్మడి మెదక్ జిల్లా విస్తరించి ఉంది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, రామచంద్రాపూర్, అమీన్‌పూర్ మండలాలు ఔటర్ లోపలే ఉంటాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోనే పటాన్‌చెరు, భారతీనగర్, ఆర్సీపురం డివిజన్లూ ఉన్నాయి. ఇక హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట, మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, నర్సాపూర్, సిద్దిపేట జిల్లాలోని ములుగు, వర్గల్, మర్కూక్ మండలాలు ఉన్నాయి.

అక్రమాలకు అనుమతులు

ఉమ్మడి జిల్లాలో జలవనరులను ఆక్రమించి నిర్మించిన వెంచర్లు, ఇళ్లకు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు సైతం పలుచోట్లా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇక మున్సిపాలిటీలు, గ్రామాల్లోనూ ఎన్‌వోసీలు ఇవ్వడంతో దర్జాగా అక్రమ కట్టడాలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున చేతులు మారాయి. గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదులు అందినప్పటికీ చూసీచూడనట్లు ఊరుకున్నారు. చెరువు శిఖం, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిల్లోనూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టిన దృశ్యాలు ఉమ్మడి మెదక్ జిల్లాలో కళ్లకు కడుతున్నాయి. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన నీరు రహదారులపై ప్రవహిస్తోంది. అందుకే హైడ్రా విభాగాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు మండలాలు, పట్టణాలకు విస్తరిస్తే ఈ అక్రమాల భాగోతం బయటపడే అవకాశం లేకపోలేదు. రాజధానికి సమీపంలో ఉన్నందున భూముల ధరలు అడ్డగోలుగా పెరగడంతో కొందరు అక్రమార్కులు చెరువులు, కుంటలను సైతం వదలలేదు.

ఆక్రమణలు ఇలా..

- ఓఆర్ఆర్ వెలుపల ఉన్న పటాన్‌చెరు మండలం రుద్రారంలోని కోమటికుంట శిఖంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి మట్టితో పూడ్చారు.
- రామచంద్రాపురం మండలంలోని చెల్లికుంట చెరువు అలుగు కాలువలో అక్రమ నిర్మాణాల కోసం మట్టిపోశారు.
- సదాశివపేట పట్టణంలోని ఊబచెరువు బఫర్ జోన్‌లో వెంచర్ల నిర్మాణం జరిగినా అధికారులు పట్టించుకోలేదు. కట్టకు లీకేజీలు ఏర్పడిన సమయంలో ఈ వెంచర్‌లోకి చెరువు నీరు ప్రవహిస్తోంది.
- వెల్దుర్తి మండల కేంద్రంలోని చెరువు కాలువ పానాదిని ఆక్రమించి దుకాణ సముదాయాలు నిర్మించారు. కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయినా ప్రయోజనం లేదు.
- చౌటకూర్ మండలం శివంపేటలోని శివ్వమ్మ చెరువు ఆనకట్టను ఆక్రమించి ఓ వెంచర్‌కు రహదారి నిర్మించారు.
- చౌటకూర్ మండలం తాడ్దానిపల్లి శివారులో సింగూరు కాలువను ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. ముడుపులు తీసుకొని నీటిపారుదల శాఖ అధికారులు ఎన్‌వోసీ జారీ చేస్తున్నారు.
- మాసాయిపేట మండలంలోని మంగలివాని కుంట, మైసమ్మ చెరువు కాలువ కబ్జాకు గురికాగా ఇరిగేషన్ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకున్నారు.
- మాసాయిపేటలోని హల్దీ డ్యాం సమీపంలో భారీగా నిర్మాణాలు జరిగినా అధికారుల పర్యవేక్షణ కొరవడింది.
- దుబ్బాక చెరువు తూమును ధ్వంసం చేసి రహదారి నిర్మించారు. పెద్దచెరువు పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయి.
- నంగునూరు మండల కేంద్రంలోని చౌడు చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు చేపట్టడం లేదు.
- సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చెరువు మధ్యన అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గణపతి కుంట, చింతల్ చెరువులను ఆక్రమిస్తూ రాత్రికిరాత్రే కబ్జా చేస్తున్నారు.
- సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు, దేవుని కుంట, బతుకమ్మ కుంట, బొబ్బిలి కుంట, ఎర్రకుంట, తుర్కవానికుంట ఎఫ్‌టీఎల్‌తోపాటు బఫర్‌జోన్‌లో విలువైన స్థలాలను అన్యాక్రాంతం చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు మామూళ్లు తీసుకొని అనుమతులు ఇస్తున్నారు.
- చేగుంట మండల కేంద్రంలోని కుమ్మరికుంట వద్ద అక్రమ నిర్మాణాలు చేపట్టినా అధికారులు స్పందించడం లేదు.
- మనోహరబాద్‌లోని రామాయపల్లి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లోనే అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా కోనాయపల్లి పీ.టీ గ్రామ పెద్ద చెరువులో సుమారు 3 ఎకరాల మేర మట్టిని నింపారు.
- నార్సింగి మండల కేంద్ర శివారు, భీమ్‌రావుపల్లి శివారులో త్రిపుర వెంచర్‌ను ఏర్పాటు చేశారు. పటేల్‌చెరువు, తిమ్మాయిచెరువు భూములను కొంతమేరకు ఆక్రమించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



సిద్దిపేటలోని గణపతి కుంటలో అక్రమ నిర్మాణాలు



చౌటకూర్ మండలం శివంపేటలోని శివ్వమ్మ చెరువు కట్టను ఆక్రమించి ఓ ప్రైవేట్ వెంచర్ కోసం నిర్మించిన దారి



దుబ్బాక పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు



చేగుంట మండలం కుమ్మరికుంట పరిధిలో నిర్మాణాలు

తపాస్‌పల్లికి గోదావరి జలాలు

బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి పంపింగ్ ప్రారంభం ● వారంరోజులపాటు కొనసాగింపు



గోదావరి జలాలకు పూలుజల్లిన మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, ఆగస్టు 24 : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరుకుంటున్నాయి. శనివారం సాయంత్రం బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి పంపింగ్ ప్రారంభించడంతో గోదారమ్మ వడివడిగా ఉరకలేస్తూ చేరుతుంది. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండుముఖం పట్టగా రైతులు గోదావరి జలాలు అందించాలని, కొద్దిరోజులుగా గోదావరి నదీప్రవాహం కొనసాగడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలని రైతులు పట్టుబడుతూ వస్తున్నారు. దీంతో గంగారం ఇన్‌టెక్‌వెల్ వద్ద ఇటీవల పంపింగ్ చేపట్టారు. ఇప్పుడు బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లికి పంపింగ్ చేపట్టారు. గోదావరిలో నీటి లభ్యత ఉన్న నేపథ్యంలో పది రోజులపాటు పంపింగ్ కొనసాగించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రిజర్వాయర్‌ను నింపిన అనంతరం కాలువల ద్వారా నీటిని అందించడంతో పాటు చెరువులను నింపేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. గోదావరి జలాల పంపింగ్ ప్రారంభించడం పట్ల కాంగ్రెస్ నాయకులు చెరుకు రమణారెడ్డి, కాయిత శ్రీనాథ్‌రెడ్డి, మల్లం బాలయ్య తదితరులు శనివారం రిజర్వాయర్ వద్ద పూలు చల్లి, కొబ్బరికాయకొట్టారు.

'సోషల్' వార్

గోదావరి జలాల పంపింగ్ ప్రారంభమైన విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య సోషల్ మీడియాలో ఫైటింగ్ కొనసాగుతుంది. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చొరవతోనే గోదావరి జలాలు వస్తున్నాయంటూ కాంగ్రెస్ నాయకులు, కానేకాదు నీటిపారుదలశాఖ కార్యాలయాలు ముట్టడిస్తామంటూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డెడ్‌లైన్ పెట్టడంతోనే పంపింగ్ చేశారంటూ బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో పోటాపోటీ పోస్టింగ్‌లను చేస్తున్నారు. గోదావరి జలాలు రప్పించిన ఘనత తమదంటే తమదేనని చెప్పుకుంటూ ఆధిపత్యం కొనసాగించేందుకు ఉవ్విళ్లూరుతుండటం చర్చనీయాంశంగా మారింది.

వీధి కుక్కలను నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్
- సిద్దిపేటలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 24 : వీధి కుక్కలను నియంత్రించేందుకు సిద్దిపేట మున్సిపాలిటీ ప్రత్యేకంగా దృష్టి సారించిందని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలో వీధి కుక్కల జనన నియంత్రణ కేంద్రాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులరాజనర్సుతో కలిసి ఆమె పునఃప్రారంభించారు. ఈ మేరకు కేంద్రంలో కుక్కలకు ఆపరేషన్ చేసే విధానం గూర్చి, అలాగే ప్రస్తుతం 20 శునకాలకు ఆపరేషన్ చేసినట్లు డాక్టర్.శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారులు వివరించారు. కుక్కల ఆశ్రమాన్ని పరిశీలించి, కేంద్ర పరిసరాలు, లోపల ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కేంద్ర ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం పక్కన ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాలలో ఫార్మసీ విభాగం, మైనస్ సెల్సియస్ డిగ్రీ భద్రపరిచే వీర్యకణాల పరికరం తదితర విభాగాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గరీమా అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర మొత్తం మీద పిచ్చికుక్కల కాటుతో చాలా మంది చిన్న పిల్లలు, పెద్దవారు ఎంతగానో ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఈవిషయాన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ మార్గదర్శకత్వంలో సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పునఃప్రారంభిరచామన్నారు. కుక్కల బెడద ఉందని సమాచారమందిస్తే, వాటిని ప్రత్యేక వాహనంలో కేంద్రానికి తీసుకువచ్చి స్టెరిలైజేషన్, సర్జరీ చేశాకా, కొన్ని రోజులు ఆశ్రమంలో విశ్రాంతినిచ్చి, ఆ తర్వాత విడిచిపెడతారని తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఇక్కడే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రేరణ, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, వార్డు కౌన్సిలర్ వడ్లకొండ సాయి తదితరులు పాల్గొన్నారు.



ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్

డెంగ్యూ కలకలం

- ఓ బాలుడు మృతి.. సిద్దిపేట ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు, అయాన్స్(ఫైల్)

సిద్దిపేట టౌన్, ఆగస్టు 24 : సిద్దిపేట పట్టణంలో డెంగ్యూతో ఓ బాలుడు మృత్యువాత పడటం కలకలం రేగింది. డెంగ్యూ ప్రబలకుండా అధికారులు మృతి చెందిన బాలుడి ఇంటి పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. జిల్లాలో చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన రాజు, రజితలు సిద్దిపేట పట్టణంలోని మైత్రివనంలో ఉంటున్నారు. వారి పెద్ద కుమారుడు అయాన్ష్ (5)కు ఈ నెల 19న జ్వరం రాగా, ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మందులు రాసిచ్చి ఇంటికి పంపించారు. అయినా, జ్వరం తగ్గకపోవడంతో ఈ నెల 22న మరోసారి ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు డెంగ్యూగా నిర్ధారించి ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం చేశారు. అయితే, శనివారం ఉదయం బాలుడిని మరో ఆస్పతికి మార్చగా, వైద్యుడు కూడా వచ్చారు. అక్కడ వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్న క్రమంలో బాలుడు మృతి చెందాడు. అయితే, మొదట్లో వైద్యం చేసిన డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తమ చిన్నారి చనిపోయాడని, ఆస్పత్రిలో నర్సు ఇంజక్షన్ ఇవ్వడంతో జర్వం పెరిగి చలి జ్వరం వచ్చిందని బాలుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. బాలుడి మృతికి కారణమైన వైద్యుడిని శిక్షించాలని ఆందోళనకు దిగారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలుని కుటుంబ సభ్యులను సముదాయించారు. అయితే, బాలుడికి డెంగ్యూలోని రెండు వైరస్‌లు అటాక్ కావడం వల్లే మృతి చెందాడని వివరణ ఇచ్చారు. ఇందులో తమ నిర్లక్ష్యం లేదని అన్నారు.

డెంగ్యూపై కళాజాత


డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పటాన్‌చెరు, ఆగస్టు 24 : డెంగ్యూ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో గ్రామాల్లో కళాజాత నిర్వహిస్తున్నారు. శనివారం పటాన్‌చెరు మండలం చిన్నకంజర్లలో కళాకారులు తమ ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, కొబ్బరి బొండాలు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సంపూర్ణ పారిశుధ్యంతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయగలమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, కళాకారులు సునీల్, రమేష్, దుర్గేష్, సంధ్య, వినేష్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదమా.. ఖేదమా..!

- 'ఖేడ్' నియోజకవర్గానికి వరించని మంత్రి పదవి
- అనాదిగా విద్యాధికులు గెలుస్తున్నా నిరాశే
- త్వరలో జరిగే కేబినెట్ విస్తరణపైనే ఆశలు
- కనీసం ఆ స్థాయి ప్రాధాన్యతనైనా దక్కాలని ప్రజల ఆకాంక్ష

నారాయణఖేడ్, ఆగస్టు 24: స్వాతంత్ర్యం సిద్ధించినాటి నుంచి ఇప్పటివరకు ఖేడ్ నియోజకవర్గాన్ని మంత్రి పదవి వరించలేదు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్తరించనున్న కేబినెట్‌లోనైనా స్థానం దక్కుతుందేమోనని జనం గంపెడాశతో ఉన్నారు. ఇక్కడి నుంచి విద్యాధికులే ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నా ప్రయోజనం లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. 1952 నుంచి మొన్నటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగితే 11 సార్లు న్యాయ శాస్త్ర పట్టభద్రులే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ఎన్నికైన పి.సంజీవరెడ్డి ఎంబీబీఎస్ పట్టభద్రుడు. 1952, 1957లో అప్పారావు షెట్కార్, 1962లో రాంచందర్‌రావు దేశ్‌పాండే, 1967, 1978, 1985లో శివ్‌రావు షెట్కార్ స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నికకాగా... 1989, 1999, 2009, 2014లలో పి.కిష్టారెడ్డి, 1994లో ఎం.విజయపాల్‌రెడ్డిలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వీరంతా న్యాయశాస్త్రంలో పట్టభద్రులే. ఇక 1972, 1983లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎం.వెంకట్‌రెడ్డి పీయూసీ వరకే చదివారు. 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికైన సురేష్‌కుమార్ షెట్కార్, డెయిరీ బీఎస్సీలో పట్టభద్రుడు. 2016, 2018 ఎన్నికల్లో గెలుపొందిన ఎం.భూపాల్‌రెడ్డి పట్టభద్రుడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన పి.సంజీవరెడ్డి కూడా ఎంబీబీఎస్ పట్టభద్రుడు. ఇక్కడ ఒక పార్టీ నుంచి గెలుపొందితే, రాష్ట్రంలో మరోపార్టీ అధికారంలోకి రావడం, సామాజిక సమీకరణలు, తదితర కారణాల వల్ల ఖేడ్‌కు ఇప్పటి వరకు మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో మంత్రివర్గంలో స్థానం దక్కనిది నారాయణఖేడ్‌కు మాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడానికి తోడు నారాయణఖేడ్ నుంచి ఉన్నత విద్యావంతుడు పి.సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, ఆందోల్ నియోజకవర్గాల్లో మాత్రమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆందోల్ నుంచి ఇప్పటికే మంత్రివర్గంలో దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తుండగా, త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలోనైనా నారాయణఖేడ్ నియోజకవర్గానికి స్థానం దక్కాలని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



నారాయణఖేడ్‌లో విక్రయానికి ఉంచిన వినాయక విగ్రహాలు



అయోధ్య రామాలయంతో కూడిన గణపతి విగ్రహాలు

సిద్ధమవుతున్న గణనాథులు

ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా తయారీ

- ఖేడ్‌లో 12 అడుగుల వరకు అందుబాటులో..
- రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు ఉన్న ప్రతిమల ధరలు
- ఇప్పటికీ అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్న నిర్వాహకులు



ప్రత్యేక ఆకర్షణతో ఉన్న లాల్‌బాగ్ గణపతి విగ్రహం

నారాయణఖేడ్, ఆగస్టు 24: వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండడంతో ఉత్సవాల కోసం ప్రతిష్ఠించడానికి వినాయక విగ్రహాలను విక్రయదారులు అందుబాటులో ఉంచారు. వినాయక పండుగ వచ్చిందంటే మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో సైతం పోటీ పడి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో.. స్వాతంత్ర్య పోరాట సమయంలో బాలగంగాధర్ తిలక్ పిలుపుతో వినాయక ఉత్సవాలను సామూహికంగా నిర్వహించడం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వినాయక మండపాలు పెరుగుతూనే ఉన్నాయి. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు గతంలో హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి విగ్రహాలను తెచ్చుకునేవారు. ప్రస్తుతం పోటీపడి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండడంతో గత ఐదారేళ్లుగా రాజస్థాన్ కళాకారులతో కొందరు వినాయక ప్రతిమలను తయారు చేయించి విక్రయిస్తున్నారు. మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి.. ఇక్కడ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో 20 వరకు విగ్రహాల దుకాణాలు వెలిశాయి. దాదాపు రెండు ఫీట్ల నుంచి 12 ఫీట్ల ఎత్తు గల విగ్రహాలు వివిధరకాలలో సిద్ధంగా ఉన్నాయి. విగ్రహం డిజైన్‌ను బట్టి రూ.2 వేల నుండి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు తమకు అవసరమైన విగ్రహాలను విక్రయదారుల వద్ద ఎంపిక చేసుకొని అడ్వాన్సులు ఇచ్చి వెళ్తున్నారు. పండుగ రోజున వాటిని తమతమ గ్రామాలకు తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఖేడ్ డివిజన్‌లో 1000 మండపాలు

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 1000 వరకు మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణ సమస్య తలెత్తుతుందని భావించేవారి కోసం మట్టి గణపతులను కూడా విక్రయిస్తున్నారు. ఈ మట్టి వినాయకులు 2 నుంచి 4 అడుగుల వరకు లభిస్తున్నాయి. ఈ విగ్రహాలు రూ.4 వేల నుంచి రూ.7 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. వినాయక చవితి సమీపిస్తుండడంతో విగ్రహాల విక్రయాల దుకాణాల వద్ద సందడి నెలకొంది. విగ్రహాల విక్రయదారుడు నీలేష్‌ను ప్రశ్నించగా, తాము మహారాష్ట్ర నుంచి విగ్రహాలను విక్రయానికి తీసుకొచ్చామన్నాడు. తమ వద్ద 4 నుంచి 10 ఫీట్ల వరకు వంద విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నాడు. గతంలో విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాలకు ఓర్చి తెచ్చుకునేవారమని, ప్రస్తుతం తాము స్థానికంగానే అందుబాటులో ఉంచడంతో ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా ఉంది.



కేదార్‌నాథ్ ఆలయ నమూనాతో ఉన్న గణపతి విగ్రహం

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రతినిధులు

నర్సాపూర్, ఆగస్టు 24: మారుతున్న కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యనభ్యసించే వారు సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యముఖర్జీ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ ఐటీ కాలేజీలో గ్రాడ్యుయేషన్ స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థులకు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య, వైస్ చైర్మన్ రవిచంద్రన్‌లతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లనరీ కోర్సుల వల్ల చాలా లాభాలున్నాయన్నారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ ద్వారా మానవ హృద్రోగ ఆరోగ్య సమస్యలు ఇంజనీరింగ్ విభాగం పరిష్కారాలు చూపిస్తుందన్నారు. ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ కోర్సులకు కూడా మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

ఏడేళ్లకు తల్లిదండ్రుల చెంతకు..

● మానసిక దివ్యాంగుడిని ఇంటికి చేర్చిన 'దర్పణం'



నాగరాజును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

శివ్వంపేట, ఆగస్టు 24: ఇంటి నుంచి తప్పిపోయిన మానసిక దివ్యాంగుడు పోలీసుల చొరవతో ఏడేళ్ల అనంతరం తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వెతికివెతికి.. ఆశలు వదులుకున్న తరుణంలో కొడుకు ఆచూకీ తెలియడంతో కన్నవారు ఆనందభరితులయ్యారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మగ్దూంపూర్ బేతని సంరక్షణ కేంద్రం నిర్వాహకుడు సాజి వర్గీస్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెమూల గ్రామానికి చెందిన నడికుడి వెంకటచారి మంజుల దంపతుల పెద్ద కొడుకు నాగరాజు(22) మానసిక దివ్యాంగుడు. మాటలు రావు. 2017లో తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లగా ఇంటి నుంచి తప్పిపోయిన నాగరాజు ఎక్కడెక్కడో తిరుగుతూ మహబూబ్‌నగర్ జిల్లా మరికల్లు మండలానికి చేరుకున్నాడు. అక్కడ స్థానికులు నాగరాజును గమనించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు మహబూబ్‌నగర్ సీడబ్ల్యూసీ ద్వారా 2017లో శివ్వంట మండలంలోని మగ్దూంపూర్ బేతని సంరక్షణ కేంద్రంలో నాగరాజును చేర్పించారు. తల్లిదండ్రులు చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పోలీసులు నాగరాజు వివరాలను 'దర్పణం' యాప్‌లో నమోదు చేయగా బేతని సంరక్షణ కేంద్రంలో ఉన్నట్టు గుర్తించారు. గురువారం తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఆధారాలతో వచ్చారు. సంరక్షణ కేంద్రం నిర్వాహకులు సాజీ వర్గీస్, మెదక్ జిల్లా బాలల సంరక్షణ అధికారి నాగరాజు, క్యాంప్ ఇన్‌చార్జి విన్సెంట్, సోషల్ వర్కర్ వీరబాబు సమక్షంలో నాగరాజును తల్లిదండ్రులకు అప్పగించారు. ఏడేళ్లుగా కొడుకు కోసం వెతకని చోటంటూ లేదని, ఆశలు వదులుకున్న సమయంలో ఆచూకీ తెలిసిందని వెంకటాచారి, మంజుల సంతోషం వ్యక్తం చేశారు. బేతని నిర్వాహకులకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

మెడికల్ కాలేజీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

● మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి



సంగారెడ్డిలో కార్మికులతో మాట్లాడుతున్న మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 24: మెడికల్ కాలేజీ కార్మికులను పర్మినెంట్ చేయాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శనివారం కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయకుండా విస్మరించారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే కార్మికులను కనీస వేతనాలు అమలు చేయాలని, లేకపక్షంలో పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సదానందం, మహేందర్, లక్ష్మణ్, నాగార్జున, సునీత, భాగ్యలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి

● చిట్టాపూర్ విద్యార్థుల రాస్తారోకో



చిట్టాపూర్ గ్రామంలోని మెదక్-సిద్దిపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

దుబ్బాక, ఆగస్టు 24: అక్బర్‌పేట- భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో బదిలీపై వచ్చిన ఉపాధ్యాయురాలును.. అదే మండలం నగరం గ్రామానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు మెదక్-సిద్దిపేట జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉండగా, నెలరోజుల క్రితం భాగ్యలక్ష్మి అనే ఉపాధ్యాయురాలు బదిలీపై వచ్చింది. పాఠశాలలో ఆమెతో కలిపి ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే నగరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కేవలం 9 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులు లేక, సీఆర్పీ ద్వారా పాఠశాలను కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారమంటూ భాగ్యలక్ష్మిని డిప్యూటేషన్‌పై నగరం పాఠశాలకు బదిలీపై పంపారు. దీంతో చిట్టాపూర్ గ్రామస్థులు, విద్యార్థులు శనివారం జాతీయ రహదారిపై బైఠాయించి, ఆందోళన చేపట్టారు. భూంపల్లి ఎస్ఐ హరీశ్ హుటాహుటిన వెళ్లి, వారిని సముదాయించారు. డీఈవోతో మాట్లాడి.. ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మిని చిట్టాపూర్‌లోనే కొనసాగిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇష్టానుసారంగా రహదారి పక్కన చెట్లు నరికివేత



మక్తభూపతిపూర్‌కు వెళ్లే రహదారి పక్కన నరికివేసిన చెట్లు

మెదక్ కల్చరల్, ఆగస్టు 24: ప్రభుత్వం చెట్లు నాటాలని, చెట్లు పెంచాలని పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిస్తుంటే.. ఇక్కడ విద్యుత్‌శాఖ తీరు భిన్నంగా ఉంది. విద్యుత్‌శాఖ మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు పనుల్లో భాగంగా మెదక్ నుంచి మక్తభూపతిపూర్‌కు వెళ్లే రహదారి పక్కన చెట్లను విద్యుత్ కొత్త లైన్‌కు అడ్డుగా ఉన్నాయనే సాకుతో చెట్ల కొమ్మలను ఇష్టానుసారంగా నరికేవేశారు. విద్యుత్ వైర్లకు తగిలిన కొమ్మలను, దగ్గరగా ఉన్న కొమ్మలను నరకటం పరిపాటే. కానీ అవసరం లేకున్నా దాదాపు 50 చెట్ల కొమ్మలను నరికిన వైనంపై పర్యావరణ హితులు, రహదారిన వెళ్లే గ్రామస్థులు మండిపడుతున్నారు. దారికి ఒక పక్కన ఉన్న చెట్లను నరికివేశారు. కొన్నిచెట్లను కొమ్మల వరకు మాత్రమే నరకగా, ఎక్కువగా చెట్లు సగభాగం వరకు నరికివేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే క్రమంలో ఈ తరహా చర్యలు తప్పనిసరి అయినప్పటికీ అవసరం లేకుండా చెట్లను నరికివేయడాన్ని తప్పుపడుతున్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద కార్యకర్తలు ఎంతో కష్టపడి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పెంచి పెద్దవిచేస్తే బాధ్యతారాహిత్యంగా ఇలా నరికివేయటం తీవ్ర ఆవేదనను కలిగించిందని పర్యావరణ హితులు, మక్తా భూపతిపూర్ యువత ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, ఆగస్టు 24: అప్పుల బాధతో వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన ముక్కపల్లి కనకయ్య(39) ట్రాక్టర్, కారుతో పాటు వ్యవసాయంలో పూర్తిగా నష్టపోయి అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనతో శుక్రవారం మద్యం బాటిల్‌లో గుర్తు తెలియని పురుగుల మందు కలుపుగుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కనకయ్యను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య బుజ్జమ్మ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.

భార్యాభర్తలు అదృశ్యం



నాగయ్య, సురేఖ(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 24: భార్యాభర్తలు అదృశ్యమైన సంఘటన జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.భాస్కర్ వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతోషనగర్‌కు చెందిన నాగయ్య, సురేఖల కొడుకు, కోడలు సాయికుమార్, స్వర్ణలతలు 21న కుటుంబ విషయంలో గొడవపడ్డారు. నాగయ్య, సురేఖ కలుగజేసుకొని గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. దీంతో సాయికుమార్ వారిపై కోపగించుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగయ్య, సురేఖ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా 22న ఉదయం 6 గంటలకు ఎక్కడికో వెళ్లిపోయారు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సాయికుమార్ శనివారం సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. వీరి గురించి ఎవరికైనా తెలిస్తే 08455 276333 లేదా 8712656718 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మదర్సా నుంచి విద్యార్థి పరారీ



షేక్ రహమాన్(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 24: మదర్సా నుంచి ఓ విద్యార్థి పరారీ అయ్యాడు. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.... హైదరాబాద్ శేరిలింగంపల్లి హఫీజ్‌పేటకు చెందిన షేక్ రహమాన్(13) సంగారెడ్డి పట్టణంలోని ప్రశాంత్‌నగర్ మసీదులో ఉన్న మదర్సాలో సంవత్సరన్నర కాలంగా చదువుతున్నాడు. కాగా ఈనెల 19న ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా మదర్సా నుంచి పారిపోయాడు. మదర్సా టీచర్ సయ్యద్ అమర్ ఈ విషయాన్ని విద్యార్థి తల్లి షబానాబేగంకు ఫోన్ చేసి చెప్పాడు. అతని గురించి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నంగునూరు, ఆగస్టు 24: అక్రమంగా తరలిస్తున్న మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాలపేట ఎస్ఐ మహ్మద్ ఆసిఫ్ తెలిపారు. శనివారం పోలీస్ సిబ్బందితో కలిసి నాగరాజుపల్లి గ్రామ బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. (టీజీ 03 టీ 0274) నంబరు గల ఆటోలో హన్మకొండకు చెందిన భూక్య గణేష్, భూక్య తరుణ్‌కుమార్, మాలోత్ రవికుమార్ మూడు టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకుని, విచారించామన్నారు. రేషన్ బియ్యాని సిద్దిపేటకు తరలిస్తున్నామని నిందితులు నిజం ఒప్పుకున్నారు. దీంతో ఆటోను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూవివాద ఘటనలో ఎస్ఐకి మెమో జారీ..?

శివ్వంపేట, ఆగస్టు 24: భూ వివాదంలో గిరిజన మహిళపై దాడిచేసి, కులం పేరుతో దూషించిన ఘటనలో బాధితురాలు ఫిర్యాదుచేసినా కేసు నమోదు చేయకుండా.. నిర్లక్ష్యం వహించిన శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డికి ఎస్పీ మెమో జారీచేసినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడలో సర్వే నంబరు 193/అ/9లో హైదరాబాద్‌కు చెందిన మార్కారెడ్డి, భూపాల్‌రెడ్డి, పిట్టలవాడకు చెందిన వారి మధ్య కొంతకాలంగా భూవివాదం నెలకొంది. ఈ నెల 15వ తేదీన ఆ భూమిలో మార్కారెడ్డి, భూపాల్‌రెడ్డిలు కడీలు పాతుండగా పిట్టలవాడకు చెందిన రేఖ, రాధలు 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, తమ భూముల్లో కడీలు పాత వద్దని అడ్డువచ్చారు. దీంతో పిట్టలవాడకు చెందిన రేఖ, రాధ, లత, శారదపై భూపాల్‌రెడ్డి దాడిచేసి కులం పేరుతో దూషించాడు. బాధితురాలు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదు. మహిళపై దాడి కథనాన్ని ఈనెల 16న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురించడంతో ఎస్పీ స్పందించి, ఎస్ఐని మందలించడంతో ఎట్టకేలకు మార్కారెడ్డి, భూపాల్‌రెడ్డి, వంశీపై కేసు నమోదు చేశారు. అయితే గిరిజన మహిళపై దాడి ఘటనపై నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ మహిపాల్‌రెడ్డికి మెమో జారీ చేసినట్లు తెలిసింది.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న గౌరారం పోలీసులు

వర్గల్, ఆగస్టు 24: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి 300 గ్రాముల గంజాయితో పాటు రెండు ఫోన్లను టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వర్గల్ మండలం శాఖారం గ్రామ చౌరస్తాలో నిషేధిత గంజాయిని విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి జానకీరామ్‌రెడ్డి, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి శాఖారం చౌరస్తాలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని విచారించగా.. పొంతనలేని సమాధానం చెప్పడంతో.. వారిని పరిశీలించగా.. గంజాయి లభించింది. ఒడిశా రాష్ట్రం, అంగుల్ జిల్లా, కళ్యాణ్‌పూర్ పోస్టు, బుదులిముండా గ్రామానికి చెందిన జగదీష్ భీర(26), గిలబంధ పోస్టు, సంకేర్ జంగ్ గ్రామానికి చెందిన ప్రశాంత్ బిస్వాల్ (34) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజబొల్లారంతండాలో ఉంటూ కూలి పనులు చేస్తుంటారు. కొంతకాలంగా ఒడిశాకు చెందిన రంజిత్ వద్ద తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి.. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యువకులకు, కూలీలకు అమ్ముతున్నట్లు తెలిపారు. 300 గ్రాముల గంజాయితో పాటు రెండు ఫోన్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మూడు కార్లు ఢీకొని ఒకరి మృతి

● ముగ్గురికి తీవ్రగాయాలు

కౌడిపల్లి, ఆగస్టు 24: మూడు కార్లు అదుపుతప్పి ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. ఈ సంఘటన కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గేటులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ నుంచి వస్తున్న కారును హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మరో కారు ఢీకొన్నది. దాని వెనకే వస్తున్న మరో కారు ముందున్న రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మహిళ మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నాచగిరి క్షేత్రంలో భక్తుల కిటకిట

- శ్రావణమాసం సందర్భంగా లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి భక్తుల రాక
- వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్, ఆగస్టు 24: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పుణ్యమాసం సందర్భంగా క్షేత్రానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ పుష్కరిణీలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూలో బారులుతీరారు. స్వామివారితో పాటు క్షేత్రంలోని ఉప ఆలయాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం పుణ్యమాసం సందర్భంగా ఆలయ మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించుకున్నారు. ఆలయంలో 52 మంది పుణ్యదంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలు, 17 స్వామివారి నిజాభిషేకాలు, 10 నిత్య కల్యాణాలు జరిపించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కార్య నిర్వహణ అధికారి అన్నపూర్ణ ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీనృసింహ నమో.. నమో..

నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి దర్శనార్థం నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. శనివారం లక్ష్మీనృసింహస్వామి వారి దర్శనం కోసం ఓ మహిళ తన ఇద్దరు కవల పిల్లలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఇద్దరు కవలలకు హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రాలంకరణ, స్వామివారి నామాలు, బొట్టు, దండలతో తయారు చేసింది.

ఐఐటీహెచ్‌లో అంతరిక్ష దినోత్సవం

- ప్రారంభించిన ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్
- ఆకట్టుకున్న అంతరిక్ష చిత్రాల ఎగ్జిబిషన్
- రాష్ట్రవ్యాప్తంగా 424 పాఠశాలల విద్యార్థులు హాజరు



ఐఐటీహెచ్‌లో అంతరిక్ష దినోత్సవం ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచిన స్పేస్ రాకెట్

కంది, ఆగస్టు 24: ఇస్రో చంద్రయాన్-3 చంద్రుడిపై దింపిన ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో నేషనల్ స్పేస్ డే సందర్భంగా శనివారం ప్రాంగణంలో అంతరిక్ష చిత్రాలతో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఇస్రో మాజీ సీనియర్ సైంటిస్ట్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డాక్టర్ కే.మృత్యుంజయ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్‌లో వినూత్నమైన స్పేస్-థీమ్‌లపై పోస్టర్లు, అంతరిక్ష ఆధారిత ఫొటో ఎగ్జిబిషన్, పెయింటింగ్, క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలోని 424 పాఠశాలల నుంచి వేలాదిమంది విద్యార్థులు హాజరయ్యారు. ఐఐటీహెచ్ అధికారులు విద్యార్థులకు అంతరిక్ష ప్రాముఖ్యతను తెలిపేందుకు కొన్ని లఘు చిత్రాలను ప్రదర్శించారు. చంద్రయాన్ రాకెట్ ప్రయోగం సక్సెస్‌పై ఇస్రో పరిశోధకులు పనితీరును వివరించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరెడ్డి మాట్లాడుతూ అంతరిక్షంలోకి చంద్రయాన్ వెళ్లిన తర్వాత దేశ కీర్తి ఎల్లలు దాటిందని, ప్రజలందరికీ అంతరిక్షం గురించి ఎక్కువ తెలిసిందన్నారు. మనిషి తలుచుకుంటే సాధించలేనిది ఏమి లేదని, తన మేధాశక్తితో గ్రహాలపై విహరించే స్థాయికి చేరారన్నారు. విద్యార్థులు అంతరిక్షంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.



విద్యార్థులకు అంతరిక్ష చిత్రాలను ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐఐటీహెచ్ అధికారులు

ముకుందా.. ముకుందా

ఈ నెల 26న శ్రీకృష్ణ జన్మాష్ఠమిని పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సృష్టి స్థితికారకుడైన శ్రీకృష్ణుని జననం, ఆయన జీవితమంతా ఓ అద్భుతమన్నారు.భగవద్గీతలోని ఆయన బోధనలు ఎంతో అమూల్యమైనవని తెలిపారు.

-ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



కోహెడ: బస్వాపూర్‌లో గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



హుస్నాబాద్‌రూరల్‌: శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో కేరళ పాఠశాల విద్యార్థులు



హుస్నాబాద్ టౌన్: నవభారత్ పాఠశాలలో గోపిక, కృష్ణుల వేషధారణలో చిన్నారులు



గజ్వేల్ మండలంలోని సింగాటం పాఠశాలలో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణల్లో విద్యార్థులు



రాయపోల్: మండలంలోని మంతూరు పాఠశాలలో గోపికల వేషధారణలో విద్యార్థినులు



సిద్దిపేట కల్చరల్: పట్టణంలోని కాకతీయ టెక్నో హై స్కూల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు

మనస్తాపంతో ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య



సితార (ఫైల్)

సిద్దిపేట క్రైం, ఆగస్టు 24: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో శనివారం జరిగింది. వన్ టౌన్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన ఇళ్లచెరువు సితార (27) అనే ట్రాన్స్‌జెండర్ రెండు సంవత్సరాల క్రితం సిద్దిపేట పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి వచ్చి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తితో స్నేహంగా ఉండేది. అతను అప్పుడప్పుడు సిద్దిపేటకు వచ్చి సితారను కలిసేవాడు. ఇద్దరు ప్రేమించుకున్నారు. శుక్రవారం రాత్రి సితార దగ్గరకు వచ్చిన సదరు వ్యక్తితో పెళ్లి చేసుకుందామని చెప్పగా నిరాకరించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సితార శనివారం తన రూమ్‌లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. సితార స్నేహితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

చేర్యాల, ఆగస్టు 24: లారీ అదుపుతప్పి డ్రైనేజీకాలువ మీదుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటన చేర్యాలలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గాంధీచౌక్ వద్ద కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో ఓవైపు దారి నిలిపివేసి వన్‌వే ద్వారా వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో సిద్దిపేట వైపు వెళుతున్న ఓ లారీ రాత్రి వేళ అదుపుతప్పి రోడ్డుపక్కన డ్రైనేజీ కాలువ మీదుగా విద్యుత్‌స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ధ్వంసమై నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్ అధికారులు మరమ్మతు చేపట్టి విద్యుత్ సరఫరా ప్రారంభించారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● ఏవో వసంతరావు

జగదేవ్‌పూర్, ఆగస్టు 24: పత్తి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వసంతరావు పేర్కొన్నారు. మండలంలోని చాట్లపల్లి వేదికలో శనివారం దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తిపంట సంరక్షణ, పురుగుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి పంటలో దిగుబడి ఎక్కువగా రావాలంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మోతాదుకు మించి మందులను పిచికారి చేస్తే మిత్ర పురుగులు చనిపోయి పంటను నాశనం చేసే పురుగుల సంఖ్య పెరుగుతుందని వివరించారు. పంటల సంరక్షణ కోసమే దేశ్‌పాండే ఫౌండేషన్ పనిచేస్తున్నదని తెలిపారు. ప్రతీ రైతు లింగాకర్షక బుట్టలను వాడుకోవాలని సూచించారు. అనంతరం 175 మంది రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో కృష్ణమూర్తి, ఎల్‌డీసీ ప్రతినిధులు అఖిలేష్, రాఘవరెడ్డి, బేయర్ కంపెనీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమ్ సతీష్, పుష్పమిత్ర, మేనేజర్ రాజేందర్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, మల్లం వెంకటేష్, రమేశ్, తప్పెట్ల రాములు, రాచకొండ బాలకృష్ణ తదితులున్నారు.

'విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి'

కుకునూరుపల్లి, ఆగస్టు 24: విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని మండల నోడల్ అధికారి సత్తయ్య సూచించారు. మండలంలోని ముద్దాపూర్, తిప్పారం, మంగోల్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఎల్ఎఫ్ఎల్ ఉన్నత పాఠశాలలో ఎల్ఐపీ కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యార్థుల స్థాయిలను పెంపొందించాలన్నారు. గుణాత్మక విద్యను అందించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సంతోష్, తిప్పారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజ్ బహదూర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఒక్క పోస్టుతో స్పందించారు..!

● విద్యుత్ సమస్యను పరిష్కరించిన అధికారులు

కుకునూరుపల్లి, ఆగస్టు 24: సోషల్ మీడియాలో విద్యుత్ సమస్యను పోస్ట్ చేయగా వెంటనే స్పందించిన జిల్లా విద్యుత్ అధికారి భానుప్రకాష్.. సమస్యను పరిష్కరించారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో మూడురోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ పంటలు ఎండిపోయే స్థితికి రావడంతో పలువురి అధికారులకు విన్నవించారు. అయినా వారు స్పందించకపోవడంతో సమస్యను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వెంటనే స్పందించిన జిల్లా విద్యుత్ అధికారి భానుప్రకాష్ మండలస్థాయి విద్యుత్ అధికారులను గ్రామానికి పంపించి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సమస్యను పరిష్కరించిన జిల్లా విద్యుత్ అధికారి భానుప్రకాష్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి



అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు చేస్తున్న దృశ్యం

మర్కుక్, ఆగస్టు 24: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పేర్కొన్నారు. మర్కుక్ మండలం చేబర్తిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య భరోసా కేంద్రంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో టీచర్లు రాణి, స్వప్న తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

కొండపాక, ఆగస్టు 24: మండలంలోని గిరాయిపల్లికి చెందిన సంతోష్‌చారి ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి స్నేహితులు రూ.44 వేలను అందజేశారు. రవీందర్, సాయి రెడ్డి, జైహీర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

విమర్శించే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి

● క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్

సిద్దిపేట టౌన్, ఆగస్టు 24: కాంగ్రెస్ నాయకులు విమర్శించే ముందు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ మండిపడ్డారు. సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ట్రోఫీ రన్నర్స్‌కు నగదు బహుమతి అందించలేదంటూ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఓ వ్యక్తి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ట్రోఫీ గురించి మాట్లాడే నైతిక అర్హత అతడికి లేదన్నారు. సిద్దిపేట క్రికెట్ స్టేడియం మరుగునపడానికి ఆ వార్డు కౌన్సిలర్ భర్త పెత్తనమే కారణమని విమర్శించారు. క్రీడాకారుల భవిష్యత్తుతో ఆటలు ఆడుతున్న ఆ వార్డు కౌన్సిలర్ భర్త సంబంధిత క్రీడశాఖ అధికారులకు ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న ఆ కౌన్సిలర్ భర్త హరీశ్‌రావు నాకు దేవుడితో సమానమని, కరోనా బారిన పడిన నన్ను కాపాడిన దేవుడు అని పొగిడి నేడు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. మీరు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మంచిగా కనబడిన పనులు ఇప్పుడు తప్పుగా కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న కలకుంట్ల మల్లికార్జున్

మోసం చేయడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, ఆగస్టు 24: ప్రజలను మోసం చేయడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య అని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రాహుల్‌గాంధీ ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకుంటామని, ఇప్పటికే రూ. 17వేల కోట్ల రుణమాఫీ చేశామని, మరో రూ.14వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరుగలేదని, వారందరి వివరాలను సేకరించి త్వరలోనే ప్రతీ రైతు రుణాన్ని మాఫీ చేస్తామన్నారు. గజ్వేల్‌లో రుణమాఫీ విషయంలో పలువురు నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, రైతులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ గతంలో రుణాలను మాఫీ చేయడంలో విఫలమయ్యారని, మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన గజ్వేల్ ప్రజలను కేసీఆర్ ఎందుకు కలువట్లేదని ప్రశ్నించారు. పదేళ్లు సీఎంగా ఉండి కూడా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డును పూర్తి చేయించలేదని దుయ్యబట్టారు. సిద్దిపేట పట్టణంలో బస్టాండ్ కూల్చివేస్తే నాలుగు నెలల్లో పూర్తి చేశారని, గజ్వేల్‌లో ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించారు. ఆయనవెంట డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు.



రైతువేదికలో మాట్లాడుతున్న నర్సారెడ్డి

'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను శాస్త్రీయంగా వర్గీకరించాలి'

గజ్వేల్, ఆగస్టు 24: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సామాజిక, ఆర్థిక సర్వేకు కమిషన్ ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను శాస్త్రీయంగా వర్గీకరించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ సూచించారు. గజ్వేల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ ఉపకులాలకు మొదటి ప్రాధన్యం ఇవ్వాలని, రిజర్వేషన్ అనుకూల, వ్యతిరేక వాదులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అణగారిన కులాల మధ్య దూరాన్ని పెంచవద్దన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

రాయపోల్/గజ్వేల్, ఆగస్టు 24: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. ఇటీవల రాయపోల్ శివారులో నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో అనాజీపూర్ గ్రామానికి చెందిన గజ్వేల్ స్వామి(30), తొగుట గ్రామానికి చెందిన ఆకారం రాజలింగం మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. శనివారం గజ్వేల్ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక విచారణ చేసి ఇద్దరికి ఒక రోజు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 3 వేలు జరిమానా విధించారు.

మద్య సేవించి వాహనాలు నడిపిన నలుగురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ గజ్వేల్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. గజ్వేల్‌లో నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీల్లో నలుగురు మద్యం సేవించి పట్టుబడ్డారని, వారిని శనివారం కోర్టులో హాజరుపరుచగా రెండు రోజుల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున రూ.8వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

చేర్యాల, ఆగస్టు 24: కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ జడ్పీఎస్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులకు సెల్‌కాన్, సెలెక్ట్, టచ్ కంపెనీల ప్రతినిధులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కమలాకర్, సయ్యద్, పాఠశాల హెచ్‌ఎం రమేశ్ తదితరులున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేట రూరల్, ఆగస్టు 24: 33 కేవీ రాఘవాపూర్ ఫీడర్ నిర్వహణ మరమ్మతుల దృష్ట్యా నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట రూరల్ డివిజన్ ఏరియాలు పుల్లూరు, రాఘవాపూర్‌లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురండి

● రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి 'పొన్నం'

హుస్నాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్ జంట నగరాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆక్రమణలకు గురైన చెరువుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. చెరువులు, కుంటల ఆక్రమణలో ఎంత పెద్దవారున్నా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

మానవ హక్కుల కమిషన్‌ను కలిసిన సాయిలు కుటుంబసభ్యులు

దుబ్బాక, ఆగస్టు24: అక్బర్‌పేట- భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామంలో ఇటీవల శవానికి కులబహిష్కరణ జరిపిన విషయం తెలిసిందే. కులబహిష్కరణ చేసి, తమను వేధించారంటూ బండమీది సాయిలు కుటుంబం సభ్యులు శనివారం హైదరాబాద్‌లోని మానవహక్కుల కమిషన్‌ను కలిసి, ఫిర్యాదు చేశారు. తమ కుటుంబానికిని జరిమానా విధించి, అన్ని రకాలుగా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న కమిషనర్

హుస్నాబాద్, ఆగస్టు 24: హుస్నాబాద్ పట్టణంలోని ఆదర్శ పాఠశాలను శనివారం మున్సిపల్ కమిషనర్ మలికార్జున్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని టాయ్‌లెట్లను పరిశీలించారు. తరగతుల నిర్వాహణ, మధ్యాహ్న భోజనం, తాగు నీరు వంటి విషయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయనవెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, శంకర్ తదితరులున్నారు.

కౌన్సిల్ సమావేశంలో పలు తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

చేర్యాల, ఆగస్టు 24: చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల పండుగ, దసరాకు బతుకమ్మ చెరువు, మహంకాళి ఆలయం వద్ద చేపట్టనున్న ఏర్పాట్లతో పాటు పలు వార్డుల్లోని మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. పారిశుధ్య సిబ్బంది వేతనాల పెంపు, ఇతరత్రా అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, వైస్ చైర్మన నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దు

● మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి



కోహెడ: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీధర్ రెడ్డి

మర్కుక్, ఆగస్టు 24: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని, రేషన్‌కార్డులు లేని రైతులకు కూడా కుటుంబ నిర్ధారణ చేసి అర్హులైన వారికి రుణమాఫీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన మర్కుక్‌లో రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు తీసుకుని రైతు వేదికకు రావాలన్నారు.

● **కోహెడ:** కోహెడలోని రైతువేదికలో ఏఈవో శ్రీధర్‌రెడ్డి రైతుల నుంచి రుణమాఫీకి సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రైతుల ఫిర్యాదుల్లో ఎక్కువగా ఒకే రేషన్ కార్డులో కుటుంబసభ్యులందరూ కలిపి రూ 2 లక్షల్లోపు ఉన్న వారికి మాఫీ కాలేదు. రేషన్ కార్డు లేకపోవడంతో కుటుంబసభ్యుల నిర్ధారణ కాలేదు. బ్యాంకు ఖాతా, ఆధార్ సమస్య, బ్యాంకులో సాంకేతిక సమస్యలు తలెత్తడం, నో డేటా ఫౌండ్ తదితర కారణాలున్నాయి. రైతువేదిక కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో శ్రీధర్‌రెడ్డి సూచించారు.

ఎల్లదాసునగర్ కాలనీని జీపీగా మార్చాలని మంత్రులకు వినతి

చేర్యాల, ఆగస్టు 24: చేర్యాల మండలం వేచరేణి గ్రామశివారు ఎల్లదాసునగర్ కాలనీని ప్రత్యేక గ్రామపంచాయతీగా మార్చాలని కోరుతూ కొమురవెల్లి మండల కాంగ్రెస్ నాయకులు శనివారం రాష్ట్ర పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి సీతక్క, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సంద్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, కార్యదర్శి సనాది భాస్కర్‌తో పాటు ఎల్లదాసునగర్ కాలనీవాసులు హైదరాబాద్‌లో మంత్రులను కలిసి విన్నవించారు. గ్రామానికి సుదూరంగా కాలనీ ఉండడంతో ఇబ్బందులుపడుతున్నామని, గ్రామపంచాయతీగా మారిస్తే ఇక్కట్లు తొలగిపోతాయని విన్నవించారు.

జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు అన్న వితరణ

చేర్యాల, ఆగస్టు 24: చేర్యాల మండలం చుంచనకోట జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు ఇటీవల వాటర్ ప్యూరిఫైర్‌ను అందించిన హైదరాబాద్‌కు చెందిన నోముల శ్యామలప్రసాద్ శనివారం పాఠశాల విద్యార్థులకు అన్న వితరణ చేపట్టారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో భువనేశ్వరీ మందిర నిర్వాహకుడు దేశపతి లలితామతిశర్మ, హెచ్‌ఎం మురళీకృష్ణ, పీఎస్ హెచ్‌ఎం ఎ.సుధాకర్, ఏజీపీఎస్ చైర్మన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 24: సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళశాలలో శనివారం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 25 మంది హాజరయ్యారు. ఇందులో అర్హతలననుసరించి 12 మంది పరీక్ష రాయగా ఇద్దరు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రతినిధులు తెలిపారు. వీరిలో సిద్దిపేటకు చెందిన పూజ, గజ్వేల్‌కు చెందిన శ్వేత ఉన్నారని తెలిపారు.



జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

మద్దూరు, ఆగస్టు 24: ఉమ్మడి మండలంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను గ్రామాల వారీగా పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో రామ్మోహన్ తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో శనివారం మాట్లాడారు. మండలంలో మొత్తం 115 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులుండగా ఒక వెంచర్ దరఖాస్తు వచ్చిందన్నారు. వీటిని ఎంపీవో, ఏఈ ఇరిగేషన్, ఆర్ఐ టీం ఆధ్వర్యంలో గ్రామాల వారీగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఒక్క మద్దూరులోనే 60 దరఖాస్తులున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఎంపీవో వీరరాజ్ ఉన్నారు.

కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న నరసరావుపేట జడ్జి



ఆలయ ఆవరణలో జడ్జి ప్రవళ్లిక

చేర్యాల, ఆగస్టు 24: కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేట మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ టి. ప్రవళ్లిక శనివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అంతకుముందు సిద్దిపేట త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ మల్లన్నను దర్శించుకున్నారు.

బదిలీపై వెళ్లిన ఏఈవోలకు సన్మానం



ఎఈవోలను సన్మానిస్తున్న ఏవో గీత

నంగునూరు, ఆగస్టు 24: మండలంలోని నర్మెట్ట, బద్దిపడగ, పాలమకుల క్లస్టర్‌లలో విధులు నిర్వహించిన వ్యవసాయ విస్తరణ అధికారులు మీరా భాయ్, స్రవంతి, అశోక్‌లు ఇటీవల బదిలీపై వెళ్లారు, ఈ సందర్భంగా ఏవో గీత ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం వారిని శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. వీరి స్థానంలో నర్మెట్ట క్లస్టర్‌కు పవన్‌కుమార్, బద్దిపడగకు వరుణ్‌వర్మ, పాలమాకులకు చైతన్యలు బదిలీపై వచ్చారని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి

● ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట క్రైం/చిన్నకోడూరు, ఆగస్టు 24: వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద, ముస్తాబాద్ చౌరస్తాలో మైనర్ డ్రైవింగ్, నెంబరు ప్లేట్లులేని, నెంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలు, త్రిబుల్ రైడింగ్‌లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాట్లాడారు. సిద్దిపేట పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణ గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీల్లో 11 రకాల ట్రాఫిక్ వైలేషన్ చేసిన వాహనదారులపై 82 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. మండలంలోని రామునిపట్ల గ్రామ శివారులో రాజీవ్‌రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని ఆయన ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.



చిన్నకోడూరు: గోనెపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, విద్యార్థులు

● **హుస్నాబాద్:** ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని సీఐ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళలకు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, నూతన చట్టాలపై జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో హెచ్‌ఎం వెంకటయ్య, కృష్ణ తదితరులున్నారు.

● **చిన్నకోడూరు:** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. మండలంలోని గోనెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శనివారం సిద్దిపేట షీటీమ్ బృందంతో కలిసి మహిళల రక్షణ చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవసరమైన మేరకే సోషల్ మీడియాను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట షీటీమ్ బృందం సభ్యులు, మహిళా కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ప్రవీణ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మురళీధర్ సూచించారు. మండలంలోని మెట్టుపల్లిలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందంతో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు.



సిద్దిపేట క్రైం: వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న ఏసీపీ సుమన్‌కుమార్